క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నీలం అప్పలనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. డెంకాడ మండలం ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు అడ్మినిస్టేట్ అధికారి దాసరి బంగారయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ: వడదెబ్బ తగలకుంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వడదెబ్బ తగలకుండా చల్లని ప్రదేశంలో ఉంటూ, తెల్లటి దుస్తులు ధరించాలని సూచించారు. నాడు – నేడు పనులలో భాగంగా పాఠశాలలో ఫేజ్–2 కింద మంజూరైన పనులు పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలని సర్వశిక్షాభియాన్ ఏఈ వెంకటరమణని ఆదేశించారు. పాఠశాలలో ఫేజ్–3 కింద మంజూరైన పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. పీహెచ్‌సీలలో రోగులకు అందుతున్న సేవలను వైద్యాధికారి రాజ్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రామారావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు


జగనన్న కాలనీని సందర్శించిన రమణమూర్తి, తదితరులు

నెల్లిమర్ల: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లన్నీ త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా హౌసింగ్ అధికారి ఎస్వీ రమణమూర్తి సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట జగనన్న కాలనీని వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతో కలిసి రమణమూర్తి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పునాది దశలో ఉన్న 88 ఇళ్లు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ జి. మురళీమోహన్, ఏఈ పవన్, స్థానిక పెద్దలు నల్లి శ్రీనివాసరావు, తుమ్ము నారాయణ మూర్తి, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఎక్స్‌లెన్స్ సెంటర్ల ఏర్పాటు ఉపయోగకరం


లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్సెలెన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ వీసీ రాజగోపాల్

డెంకాడ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో అత్యాధునిక సాంకేతికతను, ప్రతిభను పెంపొందించడానికి ఎక్స్‌లెన్స్ సెంటర్ల ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటాయని శ్రీకృష్ణదేవరాయ, జేఎన్‌టీయూ మాజీ వీసీ కె.రాజగోపాల్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సెంటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెన్ క్యూ మాజీ సీఈఓ మురళి, జేఎన్‌టీయూ జీవీ డీఈ డి.రాజ్యలక్ష్మి, వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్లు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని సుభాషిని కామన్ సర్వీస్ సెంటర్ వద్ద దాస్ మెమోరియల్ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సుభాషిని కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధులు, ట్రస్టు సభ్యులు వాండ్రంగి వెంకటేష్, పట్నాయికుని శంకరరావు, వార్డుమెంబర్ బోడసింగి సత్యనారాయణ, సతీష్, గోవిందరావు, గణపతిరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

3వేల మందికి మజ్జిగ పంపిణీ

గరివిడి వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 3 వేల మందికి శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, సంఘం ప్రతినిధులు వెంకటరాజు, సత్యారావు, సతీస్, అప్పలరాజు,లక్ష్మణరావు,సూర్యారావు పాల్గొన్నారు.

త్వరలో శంకుస్థాపన మాసోత్సవాలు


అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్, కార్పొరేటర్లు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలో రూ.33 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా త్వరలో నగరంలో శంకుస్థాపన మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 2, 15, 9 డివిజన్‌లలో రూ. 33 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. పూల్‌బాగ్ మంగలవీధిలో పార్కు, ప్రహరీ, రహదారులతో పాటు 15వ డివిజన్‌లో పూర్తి చేసిన రహదారి, 9వ డివిజన్‌లో పూర్తయిన రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, రానున్న రోజుల్లో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. త్వరలోనే శంకుస్థాపన మహోత్సవాలు నిర్వహించి నెల రోజుల పాటు వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి నేడు ప్రారంభోత్సవాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో నాలుగేళ్ల కాలంలో సంక్షేమ అభివృద్ధి పాలన సాగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డేనని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు అందివ్వడమే కాకుండా అవినీతి రహితంగా లబ్ధిదారులకు చేరుతున్నాయా, లేదా అని స్వయంగా తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.10 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్‌లీడర్ ఎస్వీవీ రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బండారు ఆనందరావు, అల్లు చాణిక్య, సయ్యద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాలన సాగిస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 27వ డివిజన్ జొన్నగుడ్డి ప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుని, వారి సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. అయితే సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన ప్రజలందరూ ప్రభుత్వ పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉంటే నగరాభివృద్ధి, సమస్యల పరిష్కారానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ, తమ డివిజన్‌లో అనేకమంది పేదవారు ఉన్నారని.. వారందరికీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరుతోందని చెప్పారు. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల నిధులు జమ కావడం పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డీఈ అప్పారావు, ఏఈలు, జోనల్ ఇన్‌చార్జ్ రెడ్డి గురుమూర్తి, పార్టీ నాయకులు ఎవర్న కుమారస్వామి, దుప్పాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


స్కిల్ హబ్ విద్యార్థుల స్వచ్ఛభారత్


స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు

విజయనగరం రూరల్: టీటీడీసీ మహిళా ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కళాశాల, స్కిల్‌హబ్ విద్యార్థులు శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ, కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు 21వ శతాబ్ద వారోత్సవాల్లో భాగంగా 15 రోజుల పాటు నిర్వహిస్తున్న జన్ బగారథి కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్వచ్ఛత కార్యక్రమాన్ని మహిళా ప్రాంగణంతో పాటు, ప్రభుత్వ ఐటీఐ వద్ద చేపట్టారు.

ఈ సందర్భంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఎస్.గోవిందరావు మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ఎంత ప్రాధ్యాన్యం ఇస్తారో.. పరిసరాలు పరిశుభ్రతకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ, సిడాప్ జాబ్ జిల్లా మేనేజర్ మార్టిన్ లూథర్,, నైపుణ్య శిక్షణా కళాశాల శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


ఎస్.కోటకు చెందిన సంతోషికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆపద్బాంధవిలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలో పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే స్థానిక క్యాంపు ఆఫీస్‌లో శనివారం పంపిణీ చేశారు. ఎస్.కోట పట్టణానికి చెందిన కొట్యాడ సంతోషి కుమారుడికి కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స కోసం లక్ష రూపాయలు, కొత్తవలస మండలం చీడివలస గ్రామానికి చెందిన రొంగళి చిన్నపామరుకి కంటి ఆపరేషన్ నిమిత్తం రూ.24వేల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో నియోజకవర్గం పరిధిలో వందలాది మంది బాధితులకు కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందజేశామని చెప్పారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, కొత్తవలస పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎస్.కోట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్టు చైర్మన్ పి.రామకృష్ణ, ఎంపీటీసీ లెంక వరహాలు, నాయకులు చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జామి–కొట్టాం వంతెన పరిశీలన


వంతెనను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జామి: గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం భారీ వాహనాల రాకపోకలతో జామి–కొట్టాం వంతెనపై రోడ్డు దెబ్బతింది. సమస్యపై జిల్లా అధికారులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, విజినిగిరి, తాండ్రంగి సర్పంచ్‌లు కె.సూర్యారావు, కె.దశరథ్, మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు తదితరులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ ఈఈ జి.వి.రమణ, జేఈ గుప్తా వంతెనను శనివారం పరిశీలించారు. అనంతరం హైవే అధికారులు రాజారావు తదితరులతో చర్చలు జరిపారు. వంతెన చాలావరకు పాడైపోయిందని, మరమ్మతులు చేయకపోతే పూర్తిస్థాయిలో దెబ్బతింటుందని హైవే అధికారులకు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. హైవే అధికారులు స్పందిస్తూ గతంలోనే మరమ్మతులు చేపడతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చామని, త్వరలో వంతెన,రహదారి మరమ్మతులు చేపడతామని తెలిపారు.

పనుల పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నాడు – నేడు అభివృద్ధి పనులను డీఈఓ లింగేశ్వరరెడ్డి శనివారం పరిశీలించారు. స్థానిక రెల్లివీధి బాలికల పాఠశాలతో పాటు జరజాపుపేట ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పునఃప్రారంభానికల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బాలికోన్నత పాఠశాలతో పాటు ఎంజేపీఏపీ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. డీఈఓ వెంట ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని బియ్యాలపేట గ్రామ శివారులో పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15,160 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వక్తృత్వ పోటీలు రేపు

చీపురుపల్లి: పట్టణంలోని గీతా మందిరంలో ఈనెల 5న శ్రీమద్భగవద్గీతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల కు గీతా మందిరం ప్రాంగణంలో పోటీలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు అంతా హాజర వ్వాలని, విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

8న నెలివాడ ఉప సర్పంచ్ ఎన్నిక

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి ఈ నెల 8వతేదీన 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ సీహెచ్ సుగుణాకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప సర్పంచ్ కోన రామబంగారయ్య తన పదవికి చేసిన రాజీనామా ఆమోదం పొందిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తిరిగి ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నామని, సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులకు సమాచారం అందించామని స్పష్టం చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తవలస: ఎల్.కోట మండలం లచ్చింపేట గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కొత్తవలస మండలం మంగళపాలెం సమీపంలో ఉన్న గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు రూ. 50 వేల విరాళం శనివారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు జగదీష్‌బాబును తన ఆశ్రమంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 7వ తేదీన ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రం అందజేశారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

శృంగవరపుకోట: ఒడిసాలోని బాలాసోర్ ప్రాంతంలో జరిగిన రైల్వే ప్రమాదంలో మృతులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శనివారం నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పలువురు మాట్లాడుతూ తమ గమ్యాలకు చేరుకోవాల్సిన వందలాది మంది మృత్యువాత పడటం, ఇటీవల దేశ చరిత్రలో పెద్ద ప్రమాదం కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈవిపత్తులో అన్ని వర్గాల ప్రజలు, యువత సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు.

రేపటి నుంచి జేవీకే కిట్ల పంపిణీ


జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రమేష్

గజపతినగరం: జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం నుంచి పంపిణీ చేయాలని ఎంఈఓ విమలమ్మకు మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర హౌస్కూల్‌లో ఏర్పాటు చేసిన జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. స్పందన కార్యక్రమానికి అందే వినతులు, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారు, తదితర అంశాలపై ఎంపిడీఓ పప్పు సుదర్శనంను ఆరాతీశారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి ఏపీఓ సీహెచ్.రామారావును అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఈఓపీఆర్డీ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్నకు చెబుదాం'

- మండల ప్రత్యేకాధికారి ఎస్వీ రమణమూర్తి


హౌసింగ్‌పై సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

నెల్లిమర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల్లో పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హౌసింగ్ అధికారి ఎస్వీ రమణమూర్తి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అందే అర్జీలను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. సంబంధిత అర్జీదారుడితో నేరుగా మాట్లాడాలని సూచించారు. ఇచ్చిన గడువులోగా సమస్యను పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాని సమస్య అయితే అందుకు గల కారణాలను తెలియజేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నాడు – నేడు అభివృద్ధి పనులను బడుల పునఃప్రారంభానికి ముందే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో నిర్మాణంలోనున్న ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఏఈ పవన్‌కు సూచించారు. ఈ నెల 1వ తేదీ నుంచి గ్రామాల్లో అమలు చేస్తున్న గ్రామీణ సర్వేక్షణ్ – 2023 కార్యక్రమానికి సంబంధించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి. గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

- స్వామివారిని దర్శించుకుని ,పూజలు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సీతారాముల చిత్రపటాన్ని అందిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో సీతారాముల సహిత లక్ష్మణ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శనివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విగ్రహ స్థిరప్రతిష్ఠాపన, పుణ్యాహవచనం, శిఖర ప్రతిష్ఠాపన, ఖరన్యాసపూర్వక దర్శనం, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టారు. సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చుంనాయుడు, మాజీ సర్పంచ్‌లు పల్లె భాస్కరరావు, వాల్లె సత్యవతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్నాన ఆదియ్య దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలకు పైబడి విరాళాలు ఇచ్చిన భక్తులను సన్మానించారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు..

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, రెల్వేబోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనుమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పూసపాటిరేగ వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి శ్రీను, వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

• నువ్వా .. నేనా..



విద్యుత్ బల్బులకు దీటుగా నువ్వా – నేనా అన్నట్లు చంద్రుడు కాంతులీనుతున్నాడు. నగరంలోని బాలాజీ జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభానికి ఉన్న బల్బు పక్కనే చంద్రుడు దర్శనమిచ్చాడు. చూడచక్కని ఈ దృశ్యాన్ని శనివారం రాత్రి సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అందుబాటులో వైద్యారోగ్య సిబ్బంది

- జిల్లా వైద్యాధికారి భాస్కరరావు


రామతీర్థంలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి భాస్కరరావు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి భాస్కరరావు సూచించారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో డ్రైడే ఫ్రై డే కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా రామతీర్థం విచ్చేసిన ఆయన ముందుగా రామస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా వైద్య శాఖలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. గ్రామాల్లో ఇంటింటా సర్కారు వైద్య సేవలు అందించే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, తదితర వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాయినందిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.